మనసొల్లని మొగుడు లేక నీవేమంటావు??

శ్రీ బచ్చల మునికన్నయ్య

ఆనాడు అందరు ఉపాధ్యాయులకు జీతాలొచ్చాయి. చాల ఉషారుగా నెలకు అవసరమైన సామానులన్నీ కొన్నాను. సాయంకాలం హాయిగా రాజా, నేను షికారు వెళ్ళాం. నవనవలాడే ఆ నందన వనంలో ఆనంద భావాలు స్వేచ్ఛగా రేకెత్తుతున్నాయి.

నేను, రాజా మాజీవితాల్లోని లోతుపాతులగూర్చి తల్చుకొన్నాం. చిన్నప్పటి ఆలోచనలకు, నేటి జీవిత నౌకాయానాలకు హస్తిమశకాంతలున్నాయని గ్రహించాం. ముందాలోచన కూడదనే పెద్దల వాక్యం వృథా కాలేదని తలంచాం. రాజా నేను ఒకే బడిలో చదివాం. గ్రామాలను పునరుద్ధరించి, గ్రామ ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించాలను భావాల హారిని సృష్టించుకొన్నాం. మా సిద్ధాంతాలను అర్థం చేసుకొనే వ్యక్తులు, మా హృదయ నిర్మలత్వాన్ని ఆకళింపు చేసుకొనే కార్యకర్తలా పల్లెల్లో కరువయ్యారు. మమ్ముల గ్రాహ్యం చేసుకోలేక పోయినా పరవాలేదు... కాని గర్హించారు. స్వార్థ పరులు మా నీతి, నిజాయతీలకు కండ్లెఱ్ఱచేసికొని కారాలు మిరియాలు నూరి బదిలీలకు ప్రయత్నించారు. దైవ వశాత్తు రాజా ఉన్నత పాఠశాల్లో, నేను ప్రాథమికోన్నత పాఠశాల్లో పంతుళ్లుగా ఒకే పట్టణంలో చేరగలిగాం. రెండుమూడు సంవత్సరాల అనంతరం... ఈ మా చిన్ననాటి జీవిత సమగ్రాన్ని స్మరణకు తెచ్చుకొన్నాం ... గంట 7-30 అయింది. ఇండ్లకు మరలాం...

కాళ్లు చేతులు కడుక్కొని కంచం దగ్గర కూర్చున్నాను. అన్నం వడ్డిస్తూ అమ్మ కంట నీళ్లు పెట్టింది.

"ఏమమ్మా! ఈ రోజు నెలకొక సంతోషదినం. జీతం తీసిన దినం కండ్లు తడిపెట్టావు?"

"భోంచేయి! తర్వాత చెప్తాలే."

"ఇదేసుమ్మా? ఏడుస్తూ ఎగతాళి చేస్తావు?"

"ఎగతాళి ఏమీలేదు నాయనా!"

"ఎందో మరి నిజం చెప్పరాదూ?"

"మీ మేనమామ కూతురు రామలక్ష్మి బావిలో పడి..."

"ఆ... ఆ..."

"ఆ... యేమి... నాయనా! చ...చ్చి...పో...యింది." అని మా అమ్మ బోరుమని యేడ్చింది. నాతల గిఱ్ఱుమని తిరుగుతూయుంది. కంచంలో అన్నం ఆరిపోయింది. మనసులో ఇనుపగుండ్ల బరువు పడింది. లేవ బుద్ధి పుట్టదు. కొంతసేపు తటమాయించి "ఏమమ్మా... నిజంగా చనిపోయిందా?"

"ఔను నాయనా?"

"ఎవరమ్మా చెప్పింది?"

"రంగయ్య మొన్న వచ్చాడట ... స్వయంగా అన్నీ చూచి వచ్చానని" చెప్పాడు.

"...... మంచిపని చేసిందిలే!"

"...................."

"అమ్మా! ఎందుకమ్మా! అప్పుడే చెప్పేశావు!"

"ఆపుకోలేక పోయాను నాయనా... భోంచేయి నాయనా!... ఆ పాడుపిల్ల చచ్చిపోవటంవల్ల కులానికి కీర్తి నిల్చింది..."

"అమ్మా... ఆ మాట అనకమ్మా! రామలక్ష్మిది తప్పేమున్నదమ్మా?"

"ఏమీలేదు-కానీలే... ఇక భోంచేయి"

"...... వద్దమ్మా !" అని లేచి చేయి కడుక్కొన్నాను. రాత్రి 9 గంటలైంది. పండుకొన్నాను. నిద్ర పట్టితేగా......

... పది సంవత్సరాల మాట... నేను ఎనిమిదవ తరగతి చదువుతూ యున్నాను. పిల్లను చూడాలని మా అమ్మ "కడప"కు దగ్గర దిగువ పల్లెకు పిల్చుకొని పోయింది... తమ్ముని యింటికి తన్మయతే చెందుతూ... మా మేనమామ... చెంగయ్యకు నామీద మితిమీరిన ప్రేమ. తన స్వంత పెద్ద బావమరిది చనిపోయిన తర్వాతనే యీ మక్కువ అంకురించింది... రామలక్ష్మికి పది వర్షాలు పూర్తికాలేదు. ఐదవ తరగతి చదువుతూయుంది. కోయిలగాన...సినిమా పాటలు చాల బాగుగా పాడేది. "అదిగో బావ వచ్చాడులే" అని వాళ్ళమ్మ అన్నప్పుడు అదో రకం చిరునగవుతో "పోమ్మా" అని గిఱ్ఱుమని తన వాల్జెడను విసురుకొంటూ యింట్లోకిపోయి మళ్లా చిన్న చిన్నగావచ్చి అమ్మ ప్రక్కన చేరేది.

వెంకట్రమణ చదువుతూ వుండి ఆకస్మికంగా మరణించాడు. చదివించి తన స్వంత బావమరిదికే తన కూతుర్ని ఇచ్చి పెండ్లి చేయాలనుకొన్న చెంగయ్యగారి హృదయం వెంకట్రమణ మరణాంతరం మారటం జరిగింది. మరొక చిన్న స్వంత బావమరిది యున్నాడు. కాని సుబ్బన్న చాల చిన్నోడు. రామలక్ష్మి కన్న రెండు వర్షాలు చిన్న. కాబట్టె ఇక చదువుచున్న నా మీద మామగారికి ఎక్కడలేని అనురాగం.

మంచంలో నిద్రపోతూ వున్నాను. చల్లగ చినుకులు పడ్డట్లు నీళ్ళు పడ్డాయి. చివాలునలేచి, చేతులు వేడిచేసి కండ్లకు అద్దుకొన్నాను. అప్పుడే ఉదయ భానుని బంగారు లేత కిరణాలు గవాక్షంపై పడుతున్నాయి. అటు ఇటు చూశాను ... "ఇది కలయా" అని సందేహపడ్డాను ... కాని కాదు... సూర్య భగవానుని చక్కలిగింత కప్పుడే విచ్చుచున్న అరవిందంలాగ సంతోష వికసిత వదనారవిందంగల రామలక్ష్మిని ప్రక్కన బారెడు దూరంలో గుంజకు ఆనుకొనియుండటం చూశాను. నా చూపులోని అమాయకత్వాన్ని చూచి పక్కున నవ్వింది... "బలే పని చేశావు... చన్నీళ్ళతో సరసమాడే జాణవే! భేష్! ఏదీ? ఒక తియ్యని పాట పాడూ!" అని అడిగాను.

...రామలక్ష్మి అటు ఇటు చూసింది.

"ఎవరూ లేరులే ... సిగ్గేటికి మరి?"

"పరవాలేదులే! పరిహాసాలకు..."

"అయితే పాడవూ?"

"చాల బిగువూ... వుండే... వుండు... పాడుతా" అని గొంతు సవరించుకొంది రామలక్ష్మి...

"బావగారితో బంతులాడితే
బంగరు ఏరు ప్రవహిస్తుందా!
బలత్కారముగ పెండ్లియాడితే
పవిత్రవలపు ప్రవిస్తుందా!"...

అని తీయని వలపు సూత్రాలన్ని ప్రబోధించింది. ఏ సినిమాలో నుండో నేర్చుకొన్నది కాబోలు. ఆ మధుర గేయానికి ప్రతిఫలం...??... జేబీ తడుముకొన్నాను. కలకండ — ఖండము — చిక్కింది చేతికి ..."ఇదిగో" అని చేయి చాపాను..."పో బావా!" అని సందేహ పడింది రామలక్ష్మి... "అదిగో మనసులో... తీసికోవాలంటున్నావు... మాటల్లో మాత్రం వద్దంటున్నావు"

"ఉత్త చెయ్యి ... ఏడ్పించేదానికా!"

"సందేహం సర్వరోగాంకురం"

"నిజంగా కలకండ యుందా?"

"రా! నోరు తెరువు! నోటిలో వేస్తా!"

"ఇంతకుముందు తీసుకోమన్నావు. ఇప్పుడు నోరు తెరువమంటున్నావు"

"తీసుకొనేది వేసుకనేదానికే కదూ?"

"ఏదీ చూపూ?" అని రామలక్ష్మి అర్థ అంగీకారాన్ని సూచించింది,

"ఇదిగో చూడు......" అని ఒక క్షణం చూపి టక్కున చేయి ముడుచుకొన్నాను. దగ్గరవచ్చి రామ

లక్ష్మి చేయి పట్టుకొనింది. నా చేయి విదిలించుకొని, రామలక్ష్మి చేయిని పట్టుకొన్నాను. నోరు తెరువమన్నాను. నోరు తెరిచి సగం కలకండ ముక్కను తిని మిగిలిన సగం నోరు తెరువమని నా నోటిలో పెట్టింది. రామలక్ష్మి లాలాజలం కలకండ మధురాన్ని పదిరెట్లు చేసినట్లుంది. ఇంతలో రామలక్ష్మి అమ్మ దొడ్లోనుండి "లక్ష్మీ!" అని పిలిచింది. రామలక్ష్మి నిరాశతో లేచిపోయింది.

మధ్యాహ్నం భోజనానంతరం తాంబూలమిచ్చారు. "చదువుకొనువారు వక్కాకు వేసికోరాద"ని మా అమ్మ చెప్పుతూయుంది. కాని అత్తగారు "ప్రతి దినమూ వేసుకోబోతావా? ఈనాడేగా?" అని మా తల్లిగారి సిద్ధాంతాన్ని రద్దు చేసింది. ప్రక్కన కూర్చొనియున్న చెంగయ్య మామగారు "రాములూ ... మామగారికి సున్నము తేపో" అన్నాడు. సున్నము తెచ్చి రామలక్ష్మి తమలపాకుతో వుంచింది, వెంటనే మా అమ్మ సున్న పాకు తొడిమ, కొన, గిల్లి "రామలక్ష్మీ! మామగారికి ఆకులు మడిచియ్యి!" అన్నది ఆనందంతో. రామలక్ష్మి తల్లిదండ్రుల సమ్మతి సూచన వదనారవిందాలను పరికించి మడిచిచ్చింది ఆకులను. అక్కడ చేరిన ఇరుగమ్మ పొరుగమ్మ "ఈలాంటి చక్కటి బొమ్మలకే పెండ్లి చేయాల"ని చప్పట్లు కొట్టుతూ నాంది పాడారు. చెంగయ్య "అందుకేమి సందేహం! చిలకాగోరంకల లాగా వారుంటే నా ఆనందానికేమి? అయినా ఇప్పుడేమించిపోయినదేమి? వీడికి కాక యింకెవరికీ యీయబోతాను? వీడు నా అక్క కొడుకేగా!" అని సమ్మతి తెలుపుతూ వాయిదా వేశాడు. ఆయన మాటలను అందుకొంటూ "అనుకొన్నది త్వరగా చేయాలి" అని అన్నది మా అమ్మ.

"ఇంకా రెండు సంవత్సరాలు దాటితే చూచుకొంటాం. ఇప్పుడే ఏమి మునిగిపోయింది?" అని రామలక్ష్మి తల్లి అడ్డ పుల్ల వేసింది. భార్య మాటను జవదాటలేని చెంగయ్య "అంతేమరి. ఇప్పుడేమి? నేనే పిలిచి పిల్లనిస్తాగా! అబ్బాయి పదవ తరగతి వరకు చదవనీ ... అంతలో అమ్మాయి బుజాఁ వయస్సుకు వస్తుంది. అవసరపడేందుకు వీలులేదు. శారదా చట్టం అడ్డంగాయుంది. ఎందుకు చట్టానికి విరోధంగా చేయాలి?" అని తన నిశ్చయాన్ని వెలిబుచ్చాడు.

"అయితేనేమీ పరవాలేదు. మాట యిస్తేచాలు. ఇంకా రెండు సంవత్సరాలుకాదు. మూడు సంవత్సరాలు దాటిన తర్వాతనే పెండ్లిచేయి" అని మా అమ్మ సమ్మతించింది,

మరునాడు మేము బయలుదేరాం. మామగారు, అత్తగారు మమ్ముల సాగనంపుతూ యున్నారు. కొంత దూరం పొయ్యాక తిరిగి చూశాను. పెరట్లో మల్లిచెట్టు పందిరి ప్రక్కన నిలబడి నిక్షిప్త నేత్రాల్తో చూస్తూయుంది రామలక్ష్మి. "పోయిరా!" అన్నట్లు తన హస్త విన్యాసం చేసింది. తియ్యని కలకండ నోటిలో పడ్డట్లైంది. తల పంకించి పల్లె దాటుకొని మా యిల్లు చేరుకొన్నాం సాయంకాలానికి,

2

మూడు వర్షాలు భూతకాలంలో లీనమయ్యాయి. మా పెద్దమామ కొడుకు రామన్న ఎగువ పల్లెనుండి నాలుగు జతల ఎద్దుల తోలుకొని వచ్చాడు మా గ్రామానికి అమ్మేందుకు. ఒక జాబు, ఒక సంచి ఇచ్చాడు రామలక్ష్మి ఇచ్చిందని నా చేత. చిరస్మరణీయంగా పంపింది కాబోలు. ఆ సంచిలో రకరకాల ఊలు దారాలతో అల్లిన విసనకఱ్ఱ, రంగు రంగుల దారాలతో అల్లిన బనీను రామలక్ష్మి హృదయాన్ని విప్పిచెప్పుతున్నాయి. జాబు మూత చింపి... "మ-రా-రా-శ్రీ మామగారికి రామలక్ష్మి ప్రార్థించి వ్రాసుకొన్న జాబు యేమంటే? నేను క్షేమంగా యున్నాను. మీ క్షేమములు తెలుపవలయును. ఆనాటి నుండి మీకు జాబు పంపాలనుకొన్నాను. కాని పంపుటకు ఎవరూ రాలేదు. ఇప్పుడు రామన్న దగ్గర పంపుతూ యున్నాను.

నీవే నా ప్రాణ భర్తగా నిర్ణయించాను. తప్పక

నిన్నే పెండ్లి చేసుకొంటాను. రామన్నతోకూడా నీవు తప్పక రావలయును.

ఇట్లు,

తమ ప్రియురాలు

"రామలక్ష్మి"

చదువుకొన్నాను. దేహం పులకరించి పోయింది. మరొకమారు జాబు చదివాను. భద్రంగా జాబును దాచుకొన్నాను. పదిరోజుల్లో ఆరు ఎద్దుల అమ్మాడు. ఇంకా రెండు ఎద్దులున్నాయి. మరునాడు అవీ అమ్ముడైనాయి. రామన్న స్వగ్రామానికి ప్రయాణం కట్టాడు. సెలవుల్లో వస్తానని చెప్పి పంపాను. వారం తిరక్కుముందే రామలక్ష్మి పుష్పవతైందని తెల్పుతూ, పుష్పవతి అయింది కుమార్తె శుభ కార్యానికి రమ్మని స్వాగత వాక్యాలతో జాబు చెంగయ్య దగ్గరనుండి వచ్చింది. పరీక్షలు దగ్గరగానున్నాయి. అమ్మను పంపాను. అన్నీ సంతోషప్రదంగా జరిగాయని అమ్మ వచ్చి చెప్పింది. పరీక్షలు ఇక పది రోజులున్నాయి. చాల ఆతురతతో పరీక్షలకై చదువుతూ యున్నాను. పదవ తరగతి పరీక్ష ... అందరు విద్యార్థులు గుండెలు చేతుల్లో పెట్టుకొని చాల పట్టుదలతో చదువుతూ యున్నారు. ఇంతలో పిడుగులాంటివార్త వినపడింది. "సుబ్బన్నకు రామలక్ష్మికి పెండ్లి" అని. మరు రోజే పెండ్లిపత్రిక వచ్చింది. హృదయం ఆగిపోయినట్లైంది. మాఅమ్మగారు ఏడ్చుచూ తమ్ముని తికమకా తిడుతూ యుంది. నాకేమి గోచరం కావటంలేదు. మరురోజు రామన్న దగ్గరనుండి జాబు వచ్చింది.

మామగారూ !

నీవు తప్పక రావలసింది. కార్యం మీరిపోతూ యుంది. పెండ్లికి రామలక్ష్మి యిష్టపడలేదు. కాని బలాత్కారంగా పెండ్లి జరుగబోనున్నది. నీవు సాహసిస్తే రామలక్ష్మిని నేను దాచిపెట్టి మీ స్వాధీనం చేయగలను. వెంటనే తప్పక రావలయును. ఈ జాబు తంతిగా భావించి రావలయును.

ఇట్లు

రామన్న

ఆ జాబు చదివాను. ఆకాశం భూమిని తాకుతున్నట్లుంది. హిమాలయం సముద్రంలో మునిగిపోయినట్లుంది. వేయిరైళ్ళు నా గుండెలో పరుగెడుతున్నట్లున్నాయి.

"ఏమి మార్పు ! ఆనాడు మామగారు పల్కిన మాటలేమి ? నేడు జరిగే కార్యమేమి ? రామలక్ష్మికి బలాత్కారముగా పెండ్లి జరుగుతుంది. సుబ్బన్న భర్త. ఇంతకూ కారణం చెంగయ్యగారి బానిస జీవనమే... చెంగయ్య అత్తగారింట్లో యిల్లరికానికి పొయ్యాడు చిన్నప్పుడే. అత్త, భార్యల మాట తిరస్కరిస్తే ఆస్తిపాస్తులకు భంగం యేర్పడుతాయని భయపడే బిరువు చెంగయ్య. చిన్నప్పటినుండి వారి అడుగులకు మడుగులొత్తే అతని గారికి స్వతంత్ర జీవనము రమ్మన్న వచ్చునా ! రాదు... పరులకిస్తే తమ ఆస్థి ఇతరులు మ్రింగేస్తారని కాబోలు. తన తమ్మునకే — చిన్నవాడైనా సరే రామలక్ష్మిని యిచ్చి పెండ్లి చేయాలని నిశ్చయించింది. భర్తగారిని శతపోరి ఒప్పించింది. రామలక్ష్మి తెలివిలో మిన్న ... గుణములో మణి. చేతలలో రత్నం. సొంత తెలివి నుపయోగించి సాహసించ వచ్చుకదా ? అయినా అబల కదూ ? తల్లిదండ్రులను వితర్కించి పదామడదూరం రావటం ఏలాగు ?... ఇష్టంలేకపోయినా తల్లి మోసపు మాటలకు బేలయిపోయిందేమో ? ......వలపించిన వరుణ్ణి ప్రేమించాలని మనసున్నా... మార్గం సుగమమైతే కదూ !... ఎట్లు పరితపించుచున్నదో పాపం... పాపమేమిటి ? పరితపించి సర్వాన్ని పరిత్యజించి నిత్యనిర్మల వలపు కౌగిటకు ఎంతటి సాహసానికైనా స్త్రీ వెనుదీయదు గదా ! ... కాని ఏమి చేయగలదు ?

కన్న తల్లిని కాలదన్ని పెంచి పెద్దచేసిన తండ్రిగారిని ద్వేషించి ఏలా ముందడుగు వేయగలదు ?... మనసు లేని మనుషులతో పోయి యేమి సాధించాలో నాకు గోచరం కావటంలేదు. రామన్న అనుకున్నంత పని అంత సులభంగా జరుగుతుందా ? పెండ్లి కార్యాల భీభత్సంతో ప్రారంభమైతే భవిష్యత్తు ఏలా పరిణమిస్తుందో ?......పరీక్షలు మూడు రోజులున్నాయి. పది సంవత్సరాల జ్ఞానాన్ని పరీక్షించి పట్టమిచ్చే తుది పరీక్ష. రాక్షస వివాహము ఎంతవరకు మన జీవితమును ఆనంద డోలికలలో నడుపగలదు ? పది అమడదూరం తప్పించుకొనిరావడం యేలాగ ?...... అందరు నన్ను ఏమనుకొంటారు ? సంఘం నన్ను నిందిస్తుందా ? నాకు నీరాజనా లిస్తుందా ? అవసర పడితే భవిష్యత్తు అంధకార బంధురమౌతుంది. నిదానం ప్రధానం"... ఈలాంటి జీవిత ప్రశ్నావళి నా తలలో వేలాదిగా దొర్లుతున్నాయి. తుట్టతుదకు రామన్నకు

"రామన్నా ! అవసరపడ మంటున్నావు. ఇది జీవిత సమస్య. ఈనాటితో పోవునది కాదు. నేనువచ్చి సంఘంలో నేటి సాంప్రదాయాలకు అక్రమంగా రాక్షస పద్ధతిలో రామలక్ష్మిని తీసుకొని పోవుటకు సాహసించటం లేదు. పరీక్ష లా మరునాటినుండి ప్రారంభం. విధితప్ప వీలుకాదు. సాధ్యమైతే మీరు రామలక్ష్మిని మా ప్రాంతానికి పిల్చుకొని వచ్చారంటే... తర్వాత అన్నీ ఆలోచిస్తాను. ధైర్యముంటే యీ పని చేయి" అని వ్రాశాను.

పరీక్షలు వారం రోజులు జరిగాయి. సెలవు లొచ్చాయి. పెండ్లి హడావిడిగా జరిగిపోయిందన్న వార్త విన్నాను. ఇంక ఆశ యెందుకు ? వివాహమైంది. చెమట పట్టుతూ యుంది. స్వేద ప్రవంతి వేడెక్కిన హృదయాన్ని తడిపి వేస్తూవుంది. విసనకఱ్ఱను తెమ్మన్నాను. అమ్మ రకరకాల ఊలు దారాల విసనకఱ్ఱ తెచ్చింది. చూశాను. మధురస్మృతులు స్ఫురణకొచ్చాయి. మందస్మిత వదనారవిందుడై "ఇంకెందుకు యీ భూతకాల అనుభవాలను ప్రేరేపించే ప్రేరణలు ?" అని... సంచి, చినిగిన బనీను, విసనకఱ్ఱ, ప్రేమలేఖలు... అన్నీ రిజిస్టరు పార్సలు చేశాను చెంగయ్యగారికి. నా బరువు తీరిపోయింది... బాధ్యత జారిపోయింది.

(సశేషము)

ఏజంట్లు కావాలి!

రాజమహేంద్రవరం, హైదరాబాద్, సికిందరాబాద్, ఒంగోలు, కడప, తిరుపతి — యింకా యితర ప్రదేశాలలో మాపత్రికలు అమ్మబడని చోట్లలో తమ స్వంత బాధ్యతపై అమ్ముటకు – ఏజంట్లుగా నున్నవారికి రూ. 100/-కు రూ. 20/-లు. కమీషను, ఒక ఫ్రీకాపీ యివ్వబడును.

అడ్వర్టైజుమెంటులను కాన్వాస్ చేయువారికి మంచి కమీషను సదుపాయముల నివ్వగలము.

వివరములకు:

గృహలక్ష్మి కార్యాలయం

రాయపేట, మద్రాసు-14